క్లుప్తంగా

వీఎంసీ డైరీ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ రూపొందించిన డైరీని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం అధికారులతో కలసి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ అందించే సేవలన్నింటినీ సమగ్రంగా ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు డైరీని రూపొందించడం అభినందనీయమన్నారు. నగరవాసులకు ఉపయోగపడేలా ముఖ్యమైన సమాచారాన్ని డైరీలో పొందుపరిచారని తెలిపారు. తద్వారా ప్రజలకు మున్సిపల్ సర్వీసుల గురించి పూర్తి సమాచారం లభిస్తుందన్నారు. నగర పరిశుభ్రత, మౌలిక వసతులు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన పెంపొందించేందుకు డైరీ దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పీ వెంకటనారాయణ, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, ఎగ్జామినేటర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అసిస్టెంట్ కమిషనర్లు వెంకటేశ్వరరావు, హెలెన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర ఆలయంలో చీరలు, పంచెల వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగళా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి అన్నపూర్ణ దేవస్థానంలో స్వామివారికి, అన్నపూర్ణాదేవికి ఉపయోగించిన చీరలు, పంచెల వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వై.సీతారామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు, 10వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు వేలంలో పాల్గొనాలని కోరారు.

డీఎస్సీ.. ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డీఎస్సీ.. ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వడానికి టెట్ అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి జి. మహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ(ఈడబ్ల్యూస్) కేటగిరీల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు కుల, ఆదాయ, స్థానికత, టెట్‌లో అర్హత కార్డు వంటి జిరాక్స్ కాపీలను దరఖాస్తుతో జతజేయాలని సూచించారు. ఈనెల 10 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు చివరి తేదీ, ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభతేదీ, కోచింగ్ వ్యవధి వంటి వివరాలను తగిన సమయంలో అభ్యర్థులకు తెలియజేస్తామని వివరించారు. పూర్తి వివరాలకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో నేరుగా గానీ, 95050 94349, 99814 48836 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వర్ధంతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయ ఉద్యమ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 46వ వర్ధంతి శుక్రవారం ఎంజీ రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమానికి అయ్యంకి చేసిన సేవలను కొనియాడారు. సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనానికి నిరక్షరాస్యత కారణమని భావించి గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులైన అయ్యంకి తన జీవితాంతం గ్రంథాలయ ఉద్యమానికి అంకితమయ్యారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్ర రావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కార్మికులు ఒత్తిడిని జయించాలి

మైలవరం: పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఒత్తిడిని జయించాలని, అప్పుడే ఉత్పత్తిలో మెరుగుదల కనిపిస్తుందని కమ్యూనిటీ మానసిక ఆరోగ్య కార్యక్రమం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రామారావు అన్నారు. కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలోని హెచ్‌బీఎల్ లిమిటెడ్, సీకే బిర్లా గ్రూపు వారి ప్లాంట్‌లో శుక్రవారం నిర్వహించిన భద్రతా వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగుల మానసిక శ్రేయస్సు కోసం సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని కంపెనీ యాజమాన్యానికి సూచించారు. యూనిట్ హెడ్ ఎన్. లక్ష్మీకాంత్, ఈహెచ్‌ఎస్ మేనేజర్ అమన్‌దీప్, డాక్టర్ శరణ్య పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అగ్రస్థానంలో..

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉండాలని అతిథులు ఆకాంక్షించారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, పోటీ ప్రపంచంలో మహిళా సాధికార దిశగా పయనించాలని సూచించారు. మహిళా సాధికారిత సాధించాలంటే విద్య ముఖ్యమన్నారు. అంతర్జాలాన్ని, అవకాశాలను వినియోగించుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. మహిళలు స్వతంత్రంగా ఆర్థికంగా జీవించినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని తెలిపారు. మహిళల్లో అక్షరాస్యత పెంచితే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులు అన్ని రంగాల్లో ముందున్నారని ఇంకా బాగా చదివి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. పురుషులతో సమానంగా ఉద్యోగ అవకాశాలు సాధించి ధైర్యంగా జీవించాలన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ అరుణ మాట్లాడారు. అనంతరం కళాశాల మహిళా అధ్యాపకులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ, రాజ్యలక్ష్మి, రోజ ల్లిండ్, బాలసుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు సుధాకర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో..

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తేనే సమాజంలో గౌరవంగా జీవించగలరని అందుకు చదువే ఆధారమని ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ అన్నారు. గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు దేశాభివృద్ధిలో కీలకం

పాయకాపురం(విజయవాడరూరల్): మహిళలు ఆరోగ్యం-కుటుంబం, సమాజం, దేశాభివృద్ధిలో కీలకమని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా సంస్థ అసిస్టెంటు డైరెక్టర్ ఇన్‌చార్జ్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ, సీసీఆర్ఎస్, ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళల ఆరోగ్య అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏడీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరోగ్యమే అసలైన ఆభరణమని, మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, నిర్దిష్ట కాలం తర్వాత తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవనశైలితో అనేక దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చనన్నారు. డాక్టర్ కె.లక్ష్మీ ప్రియదర్శిని మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణ, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యం, క్యాన్సర్ నివారణ ఆరోగ్యకరమైన జీవనశైలిపై విలువైన మార్గదర్శకాలు అందించారు. అనంతరం డాక్టర్ కె.లక్ష్మీప్రియదర్శిని రోగులు అడిగిన సందేహాలను తీర్చారు. డాక్టర్ పి.సుజాత పరిశోధన అధికారి సమన్వయకర్తగా వ్యవహరించారు.

అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న మహిళలు

విజయవాడస్పోర్ట్స్: ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ మహిళలు ముందంజలో కొనసాగుతున్నారని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కార్యాలయ పరిపాలన విభాగంలోని మహిళా ఉద్యోగులను డీసీపీ సరిత శుక్రవారం ఘనంగా సత్కరించి ఒక్కొక్కరికి ఒక్కో చీరను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని, విద్య, ఉద్యోగం, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం రోజురోజుకు పెరుగుతోందన్నారు. సమాజంలో తమకంటూ గుర్తింపు తెచ్చుకొని కుటుంబంపై అత్యంత శ్రద్ధగా బాధ్యతగా మహిళ మాత్రమే మెలగగలదన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి సునీత, పరిపాలనా విభాగ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్, సంఘ సభ్యులు జి.శేషారత్నం, జి.కల్యాణి, ఎ.వి.ఎస్.ఎస్.కల్యాణి, ఆనంద్, నగేష్, పెరుమాళ్, బుచ్చయ్య, ఫ్రాన్సిస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం మన బాధ్యత

విజయవాడస్పోర్ట్స్: నిత్యం ఒత్తిళ్లతో సతమతమవుతున్న మహిళలు క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందుతారని, ఎన్టీఆర్ జిల్లా ఉప రవాణా అధికారి(డీటీసీ) ఎ.మోహన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని రవాణా శాఖ కార్యాలయంలో మహిళలకు క్రీడా పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ నర్సింగ్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీదేవి జడ్జిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా డీటీసీ ఎ.మోహన్ మాట్లాడుతూ ఓవైపు కుటుంబంతో మరోవైపు ఉద్యోగంతో అలుపు లేకుండా బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళలు క్రీడలో పాల్గొని మనోధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని పొందాలన్నారు. మహిళలు విద్య, రాజకీయాలు, మీడియా, కళలు, సంస్కృతి, సేవా విభాగాలు, విజ్ఞాన, సాంకేతిక రంగాలు వంటి అన్ని రంగాల్లో ముందుంటున్నారన్నారు. దేశ రాజకీయాల్లో ఉన్నతమైన పదవులను చేపట్టారని, మహిళల్లో ఉన్న ఆత్మవిశ్వాసమే వారి విజయాలకు కారణమన్నారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారన్నారు.

ఈ సందర్భంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటల్లో విజేతలకు డీటీసీ మోహన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీఓ ఆర్.ప్రవీణ్, వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు సత్యనారాయణ, అబ్దుల్ సత్తార్, చంద్రకళ, జి.ఉష సుందరి, మహిళా ఉద్యోగినిలు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్, డీసీపీ ఉదయరాణి తదితరులు



గురుకుల కళాశాలలో..



కార్యాలయ ఉద్యోగులకు చీరను బహూకరిస్తున్న అడ్మిన్ డీసీపీ సరిత



మహిళలకు బహుమతులు అందజేస్తున్న డీటీసీ మోహన్

అవకాశం ఇవ్వాలేగానీ..



డాక్టర్ నీరజ, ప్రిన్సిపాల్, మహిళా గురుకుల కళాశాల

మధురానగర్(విజయవాడసెంట్రల్): అవకాశం ఇవ్వాలే కానీ అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా పనిచేసి ఫలితాలు సాధించగలమని మహిళలు నిరూపిస్తున్నారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కలాశాల, గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాలలను ఇద్దరు మహిళలు సమర్థంగగా నిర్వహిస్తూ పలువురి మన్ననలు అందకుంటున్నారు.

ఎస్‌ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కళాశాలను అభివృద్ధి పథంలో నిలపటంతో పాటు నాక్ గ్రేడ్ సాధించేందుకు కృషి చేశారు. 150 మందికి పైగా సిబ్బంది, 1500కు పైగా విద్యార్థులు కలిగిన కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు. క్రీడలు, ఉపాధి ఆధారిత శిక్షణలు కల్పిస్తూ విద్యార్థులతో మమేకమై మహిళల సత్తాను నిరూపిస్తున్నారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ 13 మంది సిబ్బంది, 175 మంది విద్యార్థులను సమన్వయం చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇక్కడ విద్యతో పాటు విద్యార్థుల భద్రతకు అవసరమైన కరాటే వంటివి శిక్షణ ఇస్తూ మహిళా సాధికారిత సాధించడానికి కృషి చేస్తున్నారు. ఉచితంగా ఉపాధి ఆధారిత కోర్సులకు శిక్షణ అందజేస్తున్నారు.

బ్రాహ్మణులు వ్యాపార రంగంలో విజయం సాధించాలి



బిగ్ బిజినెస్ వ్యాపార సముదాయాన్ని ప్రారంభిస్తున్న మల్లాది విష్ణు, లీలా ప్రసాద్, జింకా చక్రధర్ తదితరులు

విజయవాడ కల్చరల్: బ్రాహ్మణులు వ్యాపార రంగంలో విజయాలు సాధించాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. విప్ర వ్యాపార సాధికారిక సంస్థ, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే బిగ్ బిజినెస్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు రాజకీయరంగంలోనూ విజయాలు సాధించాలన్నారు. కార్పొరేటర్ శర్వాణీమూర్తి మాట్లాడుతూ బిగ్ బిజినెస్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ వ్యాపార ప్రముఖులు జింకా చక్రధర్, దమ్మాలపాటి లీలాప్రసాద్, పిల్లల మర్రి సునీల్, ఉప్పులూరి రాజా పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలలోని చిరువ్యాపారులు 70 మంది తాము తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి విక్రయించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

శ్రీపంచమవేద నృత్యాలయ నిర్వాహకురాలు నాట్యాచారిణి కంచర్ల కావ్య బృందంతో పలు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించింది. నిర్వాహకులు చిన్నారులను, నాట్యాచారిణి కావ్యను సత్కరించారు.

మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



కార్మికురాలిని సత్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళలు అన్నిరంగాల్లో ముందుంటూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోగల అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. మినిస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా పలువురు మహిళా కార్మికులను సత్కరించారు. ఈసందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళాభివృద్ధి అంటే దేశాభివృద్ధి అన్నారు. విద్య, ఉద్యోగం, వృత్తిలో రాణించి సమాజాభివృద్ధికి దోహదపడాలన్నారు. మహిళలు ముందంజలో ఉండాలంటే కుటుంబసభ్యుల సహకారం ముఖ్యమని పేర్కొన్నారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ మహిళలు ఎక్కడైతే పూజింపబడి గౌరవించబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారన్న నానుడి అక్షర సత్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ రజియ షబీన, అసోసియేషన్ ప్రెసిడెంట్ రాంబాబు, సెక్రటరీ చలం, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల వశం చేసే బడ్జెట్

రైతు సంఘం సీనియర్ నాయకుడు కేశవరావు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు కేశవరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేసే దిశగా 2025-26 బడ్జెట్ ఉందని రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు అన్నారు. ఈ బడ్జెట్‌ను రివైజ్ చేసి వ్యవసాయ, సాగునీటి రంగాలను కాపాడుకోకపోతే రాష్ట్ర దివాళా తీస్తుందన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఎం.బి.విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యుడు ఎస్.వి.రామరాజు అధ్యక్షతన ఏపీ అభివృద్ధి 2025-26 బడ్జెట్ పరిశీలన అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేశవరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను పూర్తిగా విస్మరించారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆయా రంగాలకు సక్రమంగా కేటాయింపులు అమలుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కరవు ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి వాటిని పూర్తి చేయడానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రస్తుతం బడ్జెట్‌లో చూపించిన కేటాయింపులను పరిశీలిస్తే ఈ ఐదేళ్ల కాలంలో ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాదని స్పష్టం చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలవుతున్నారని, ధరల స్థిరీకరణకు కనీసంగా రూ.4వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అనుగుణంగా బడ్జెట్ కేటాయించ లేదన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ కార్పొరేటీకరణను ముందుకు తీసుకెళ్తూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్ అని విమర్శించారు.

రూ.80 వేల కోట్ల రెవెన్యూ లోటును ఎలా భర్తీ చేస్తారో స్పష్టత ఇవ్వలేదని, దీన్ని బట్టే అభివృద్ధిని పక్కదారి పట్టించే బడ్జెట్‌గా ఉందన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆరు గ్యారెంటీల్లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదని మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న మాట్లాడుతూ పాఠశాల విద్యతో పాటు ఉన్నత విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. నూరుశాతం అక్షరాస్యత సాధనకు బడ్జెట్‌ను రివైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎస్.అనిల్, సుజాత, గుండు నారాయణ, యువి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చండి

బీఈఎఫ్ఐ నేత అజయ్‌కుమార్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్ బీయూ) పిలుపు మేరకు ఈనెల 24, 25 తేదీల్లో సమ్మె చేపట్టనున్నట్లు బీఈఎఫ్ఐ నేత ఆర్. అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ఎస్‌బీఐలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకింగ్ రంగంలో 5 రోజుల పని దినాలు ప్రవేశపెట్టాలన్నారు. ఉద్యోగులు, అధికారుల తరపున బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌ను నియమించాలన్నారు. 12వ వేతన సవరణ ఒప్పందంలో మిగిలిన సమస్యలను పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రవేశపెట్టిన గ్రాట్యూటీ సీలింగ్‌ను (రూ. 25 లక్షల) బ్యాంకు ఉద్యోగులకు కూడా వర్తింపజేయడంతోపాటు ఆదాయ పన్ను మినహాయింపునివ్వాలని కోరారు. స్టాఫ్‌కు ఇచ్చే సంక్షేమ ప్రయోజనాలపై ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలన్నారు. ఇటువంటి ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మెకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు రఘురాం, హేమారెడ్డి, శ్రీనివాస్, వి.ఎస్.ఎస్.వి. నారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్!

పాతపాయకాపురంలో కదలని మురుగు



61వ డివిజన్‌లోని కాల్వల్లో పేరుకున్న వ్యర్థాలు

పాయకాపురం(విజయవాడరూరల్): కాల్వల్లో ప్రతి రోజూ డి సిల్టింగ్ చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర చెబుతున్నా పాయకాపురంలో ఆయన ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నారు. 61వ డివిజన్ పాత పాయకాపురంలో కాల్వలో చెత్తాచెదారం కదలకుండా పేరుకుని కనిపిస్తున్నాయి. రోజుల తరబడి అలాగే నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. దోమల బాధ పెరిగిందని ఆందోళన వ్యక్త చేస్తున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలంటున్నారు. వీఎంసీ అధికారులు స్పందించి డ్రెయిన్లలో వ్యర్థాలు నిలవకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ దుర్గాపురం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గాంధీనగర్ పరిధిలో..

దుర్గాపురం, బావాజీపేట, రామానగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సూర్యారావుపేట సెక్షన్ పరిధిలో...

శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సూర్యారావుపేట సెక్షన్, జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్ 11 కేవీ కస్తూరిబాయిపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. గోపాలరెడ్డి రోడ్, రైల్వే క్లబ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, ఇంటెలిజెన్స్ ఆఫీస్, కస్తూరిబాయిపేట పుష్పా హోటల్ ఏరియా, కాళేశ్వరావు రోడ్, ప్రకాశం రోడ్, లతా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏరియా, పొగాకు బ్యారెన్ రోడ్, చలసాని వెంకట కృష్ణయ్య వీధి, కస్తూరిబాయి పేట, బెల్లపు శోభనాద్రి వీధి, రామనాథం వీధి, చలమలవారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ లైన్ల నిర్వహణ దృష్ట్యా దుర్గాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాపురం, బీఆర్టీఎస్ రోడ్డు, పున్నయ్య కాలనీ, గులాబీతోట, భానునగర్, రాజీవ్‌గాంధీ రోడ్డు, సంగీత కళాశాల రోడ్డు, సాంబమూర్తి రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ముగిసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా కళాశాలలో అమెజాన్ వెబ్ సర్వీస్, క్లౌడ్ కంప్యూటింగ్ అంశంపై బీటెక్ మూడో ఏడాది విద్యార్థులకు ఐదు రోజులుగా జరుగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ట్రైనర్ చెల్లు రామకృష్ణ క్లౌడ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యాన్ని వివరించారు.

లోన్ క్లియరెన్స్ అందజేసి నష్టపరిహారం చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి సర్టిఫైడ్ కాపీలతోపాటు ఆస్తిపై ఎటువంటి బాకీ లేదని, నష్టపరిహారం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మి రాయలు శుక్రవారం తీర్పు చెప్పారు. విజయవాడకు చెందిన ఆర్‌వీ సత్యనారాయణమూర్తి అప్పటి ఆంధ్రాబ్యాంకు విజయవాడ మెయిన్ బ్రాంచ్‌లో 2010వ సంవత్సరంలో రూ. 20 లక్షలు రుణంగా తీసుకున్నారు. లోన్ నిమిత్తం ఆయన భార్య నరసమాంబ ఆస్తి పత్రాలను గ్యారెంటర్‌గా బ్యాంకులో డిపాజిట్ చేశారు. 2018లో వడ్డీతో సహా లోన్ క్లియర్ చేశారు. అయితే లోన్ మొత్తం కట్టినా కూడా ఆస్తి పత్రాలు బ్యాంకు వారు తిరిగి ఇవ్వకుండా కనిపించడం లేదని సర్టిఫైడ్ కాపీలను ఇస్తామని చెప్పారు. ఒరిజనల్ పత్రాల కోసం బ్యాంకు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో సత్యనారాయణమూర్తి వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సభ్యులు విచారణ అనంతరం ఆస్తిపత్రాల సర్టిఫైడ్ కాపీలతోపాటు ఆ ఆస్తిపై ఎటువంటి బాకీ లేదని సర్టిఫికెట్, ఫిర్యాదుదారునికి డాక్యుమెంట్లు ఇవ్వాలని, ఫైనాన్షియల్ డ్యామేజ్ కింద ఆస్తిపత్రాలకు రూ. 5 లక్షలు నష్టపరిహారం, మానసిక వేదన కలిగించినందుకు రూ. 50 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు 30 రోజుల్లోగా ఇవ్వాలని తీర్పు వెల్లడించారు.

పరిశ్రమల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

ఇబ్రహీంపట్నం: పరిశ్రమల్లో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర పరిశ్రమల డెప్యూటీ చీఫ్ మేనేజర్ టి.రాజు అన్నారు. ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో జరుగుతున్న 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలు, పని ప్రదేశాల్లో చక్కని పర్యావరణ వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థ సీఈ టి.నాగరాజు మాట్లాడుతూ పర్యావరణలో సంస్థకు జాతీయ అవార్డు దక్కేలా కార్మికులు, ఉద్యోగులు కృషి చేయాలన్నారు.